సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 28 । జూన్ । 2024



సోమశిలలో 10.10 టీఎంసీలు
సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 10.10 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 393 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,530
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,603
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,801
నవర (8 గ్రాములు)	రూ.54,408



ప్రమాదానికి గురైన బస్సు
అతివేగంతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి పొల్లాల్లోకి దూసుకెళ్లింది. ఉలవపాడు మండల పరిధిలోని చాగల్లు – వీరేపల్లి మధ్య ఘటన గురువారం చోటుచేసుకుంది. 8లో

న్యూస్‌రీల్

ముగిసిన ఇంటర్వ్యూలు

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు సమీపంలో గల వీఎస్‌యూలో నిర్వహిస్తున్న పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు గురువారంతో ముగిశాయని ఏపీఆర్‌సెట్ కోఆర్డినేటర్ డాక్టర్ హనుమాన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఆర్‌సెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు వీటిని నిర్వహించామని చెప్పారు. బయోటెక్నాలజీలో 94 మందికి గానూ 65 మంది, అప్లయిడ్ లైఫ్ సైన్స్‌లో 87 మందికి గానూ 62 మంది, సోషల్ వర్క్స్‌లో 37 మందికి గానూ 30 మంది, టూరిజం మేనేజ్‌మెంట్‌లో ఎనిమిది మందికి గానూ ఐదుగురు హాజరయ్యారని తెలిపారు.

ఒకటి నుంచి పింఛన్ల పంపిణీ

నెల్లూరు(పొగతోట): ఎన్టీఆర్ భరోసా పింఛన్లను జూలై ఒకటి నుంచి పంపిణీ చేయాలని డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి ఆదేశించారు. నగరంలోని డీఆర్డీఏ కార్యాలయం నుంచి ఎంపీడీఓలు, సచివాలయ సిబ్బందితో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పింఛన్‌ను రూ.నాలుగు వేలకు పెంచుతూ ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసిందని వివరించారు. గత మూడు నెలలకు సంబంధించిన బకాయిలు రూ.మూడు వేలు.. రానున్న నెల మొత్తంతో కలిపి రూ.ఏడు వేలను పంపిణీ చేయాలని సూచించారు. లబ్ధిదారుల ఇంటి వద్దకు సచివాలయాలు, పంచాయతీ సిబ్బంది వెళ్లి నగదును అందజేయనున్నారని వివరించారు. ఒకటో తేదీ ఉదయం ఆరు నుంచే పంపిణీ ప్రక్రియకు శ్రీకారం చుట్టాలని కోరారు.

జిల్లా ఉద్యానాధికారి బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(సెంట్రల్): జిల్లా ఉద్యాన శాఖ అధికారిగా సుబ్బారెడ్డి తిరిగి బాధ్యతలను గురువారం చేపట్టారు. నెల రోజులుగా సెలవుపై ఉన్న ఆయన తన కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు.

రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (టౌన్): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలకు సంబంధించిన రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌కు జూలై ఒకటిలోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రామారావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా ఫీజును ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని చెప్పారు. రీ కౌంటింగ్‌కు ప్రతి సబ్జెక్టుకు రూ.500 చొప్పున, రీ వెరిఫికేషన్ కోసం రూ.వెయ్యిని చెల్లించాలని సూచించారు.

మాతృశాఖకు ఐటీడీఏ పీఓ బదిలీ

నెల్లూరు(వేదాయపాళెం): నెల్లూరు ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మందా రాణిని మాతృశాఖకు బదిలీ చేశారు. ఈ మేరకు ట్రైబల్ కల్చర్ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్ మిషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా విశాఖపట్నానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం గురువారం జారీ చేసింది. కాగా ఆమెపై గిరిజన సంఘ నేతలు ఇటీవల పలు ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలోనే బదిలీ చేశారని సమాచారం.

క్యాంపస్ డ్రైవ్‌లో 103 మంది ఎంపిక

నెల్లూరు (టౌన్): నగరంలోని వెంకటేశ్వరపురంలో గల ప్రభుత్వ బాలికల ఐటీఐలో ద్వితీయ సంవత్సర పరీక్షలు రాసిన విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను గురువారం నిర్వహించారు. 144 మంది విద్యార్థులకు గానూ 103 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ రజియా తెలిపారు. వీరిలో 65 మందికి ఆఫర్ లెటర్లను అందజేశారన్నారు. నారా అఖిలారెడ్డి, ఐటీఐ జిల్లా కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి రామాంజనేయులు, టాటీ సీమెన్స్ సీనియర్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణలో మృతి చెందిన పోలీస్ సిబ్బంది కుటుంబాలను అన్ని విధాలా ఆదుకొని అండగా ఉంటామని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ పేర్కొన్నారు. వేదాయపాళెం పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వర్తిస్తూ హోంగార్డు వెంకటేశ్వర్లు ఈ ఏడాది మార్చిలో మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన కుటుంబానికి ప్రమాద బీమా ద్వారా రూ.34 లక్షలు మంజూరయ్యాయి. ఈ మొత్తాన్ని ఎస్పీ తన చాంబర్‌లో మృతుడి సతీమణి కృష్ణవేణికి చెక్కు రూపంలో గురువారం అందజేశారు. బీ సెక్షన్ సూపరింటెండెంట్ ఖతీజాబేగం తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతు ఖుషీ ఖుషీ



పొగాకు పంట రైతుల ఇంట సిరులు కురిపిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లో ఏర్పడిన డిమాండ్‌తో మూడేళ్లుగా సాగు లాభదాయకంగా ఉంది. అయితే ఈ ఏడాది మాత్రం ఊహించని స్థాయిలో లాభాలను తెచ్చిపెడుతోంది. దీనికి తోడు పొగాకు రైతులకు అనుకూలంగా గత ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకోవడంతో ఆదాయాలు రెండింతలయ్యాయి. ఈ క్రమంలో పొగాకును భారీగా సాగు చేశారు. దీనికి అనుగుణంగా వేలంలో పొగాకు ధరలు ఆశాజనకంగా ఉండటంతో వీరంతా ఖుషీఖుషీగా ఉన్నారు.



పొగాకు బేళ్లు

మార్కెట్లో రికార్డు ధరల నమోదు
- కిలోకు అత్యధికంగా రూ.358
- సరాసరి ధర రూ.254గా ఉన్న వైనం
- ఇప్పటి వరకు 81 మిలియన్ కిలోల విక్రయాలు పూర్తి
- అనధికారిక అమ్మకాలపై రాని స్పష్టత

కందుకూరు: పొగాకు మార్కెట్లో వర్జీనియా పొగాకు ధరలు ఈ ఏడాది మోత మోగిస్తున్నాయి. ఊహించని విధంగా లాభాలను ఆర్జిస్తుండటంతో రైతుల ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. మరోవైపు బోర్డు అనుమతించిన మేరకు విక్రయాలు పూర్తి కావొస్తుండగా.. అనధికారిక విక్రయాలపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ నేపథ్యంలో వేలం మరో రెండు నెలల పాటు సాగే అవకాశం ఉందని అధికారులు, రైతులు అంచనా వేస్తున్నారు.

81 మిలియన్ కిలోల విక్రయాలు

రెండేళ్లుగా పొగాకు మార్కెట్ ఆశాజనకంగా ఉండటంతో సాగు విపరీతంగా పెరిగింది. వేలంలో ప్రస్తుతం నమోదవుతున్న గణాంకాలే దీనికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. పొగాకు బోర్డు ఒంగోలు రీజియన్ పరిధిలోని ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 11 వేలం కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో 2023 – 24 సీజన్లో 88 మిలియన్ కిలోల పొగాను పండించేందుకు బోర్డు అనుమతిచ్చింది. ఇప్పటికే 81 మిలియన్ కిలోల పొగాకు విక్రయాలు పూర్తయ్యాయి. మరోవైపు 139 మిలియన్ కిలోల పొగాకును పండించారని బోర్డు అధికారులు అంచనా వేస్తున్నారు. దీని బట్టి రైతుల వద్ద దాదాపు 58 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తులు నిల్వ ఉన్నాయని తెలుస్తోంది. అనధికారికంగా పండించిన పొగాకు.. రైతులు వద్ద పెండింగ్‌లో ఉంది.

పెనాల్టీ రద్దుతో లబ్ధి

అనధికారిక పొగాకు విక్రయాలపై గతంలో ఐదు శాతం పెనాల్టీని విధించేవారు. అయితే రైతుల విజ్ఞప్తి మేరకు 2022 – 23 సీజన్లో గత ప్రభుత్వ చొరవతో ఈ పెనాల్టీని పొగాకు బోర్డు రద్దు చేసింది. దీని ద్వారా ఒక్కో రైతుకు సరాసరిన రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకు లబ్ధి చేకూరింది. ఇక పొగాకు ముక్కను ఈ ఏడాది నేరుగా వేలం కేంద్రాల్లోనే విక్రయించేలా అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో గతంలో మాదిరిగా ఈ ఏడాదీ అనధికారిక పొగాకు విక్రయాలపై పెనాల్టీని రద్దు చేయాలని రైతులు కోరుతున్నారు. బోర్డు నిర్ణయంలో జాప్యం కారణంగా అధికారిక పొగాకు విక్రయాలు పూర్తయిన కేంద్రాల్లో అమ్మకాలు ప్రస్తుతం నిలిచిపోయాయి. దీంతో ఆయా కేంద్రాల్లో పొగాకు చూర, ముక్క వంటివి కొనుగోలు చేస్తున్నారు. బోర్డు నిర్ణయం వచ్చిన వెంటనే అనధికారిక పొగాకు కొనుగోళ్లను చేపడతామని చెప్తున్నారు.

బ్యారన్ల కోసం పోటాపోటీ

పొగాకు పంట రైతులకు కాసులు కురిపిస్తుండటంతో సాగుపై విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. దీంతో తమకున్న పొలాలు, బ్యారన్లే కాకుండా ఇతర బ్యారన్లు, పొలాలను కౌలుకు తీసుకునేందుకు రైతులు పోటీ పడుతున్నారు. దీంతో ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటాయి. కందుకూరు పరిధిలో గతేడాది రూ.1.5 లక్షలు ఉన్న బ్యారన్ కౌలు ప్రస్తుతం రూ.2.5 లక్షలకు చేరింది. అయినా వీటిని దక్కించుకునేందుకు రైతుల మధ్య విపరీతమైన పోటీ నెలకొంది. ఈ పరిణామాలతో అనధికారిక బ్యారన్లను ఇష్టమొచ్చినట్లు నిర్మిస్తున్నారు. ఈ పరిస్థితిని చూసి బోర్డు అధికారులే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే సీజన్‌కు ఇప్పటి నుంచే అడ్వాన్స్‌లు ఇచ్చి బ్యారన్లు, పొలాలను కౌలుకు తీసుకుంటున్నారు.

కందుకూరు కేంద్రంలో ఇలా..
- కందుకూరు రెండో వేలం కేంద్రంలో 7.9 మిలియన్ కిలోల పొగాకు విక్రయాలకు అనుమతి ఉండగా, ఇప్పటికే ప్రక్రియ పూర్తయింది. అయితే 13.5 మిలియన్ కిలోల పొగానును పండించారని అధికారులు అంచనా వేశారు.
- కందుకూరు – 1 వేలం కేంద్రంలో 9.2 మిలియన్ కిలోల పొగాకుకు బోర్డు అనుమతిస్తే, ఇప్పటికే ఎనిమిది మిలియన్ కిలోల మేర విక్రయాలు పూర్తయ్యాయి. ఈ వేలం కేంద్ర పరిధిలో 15.5 మిలియన్ కిలోల వరకు రైతులు పండించారని భావిస్తున్నారు.

వెలువడని నిర్ణయం

మరోవైపు డీసీపల్లి వేలం కేంద్రంలో విక్రయాలు ముగిశాయి. కందుకూరులో రెండు.. కలిగిరి, డీసీపల్లిలో వేలం కేంద్రాలు ఉండగా, వీటి పరిధిలో అధికారిక విక్రయాలు దాదాపు పూర్తి కావొచ్చాయి. అనధికారిక పొగాకు విక్రయాలపై బోర్డు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ప్రక్రియ ప్రారంభంకాలేదు.

కిలో పొగాకు సరాసరి ధర రూ.254

పొగాకు మార్కెట్ ఆశాజనకంగా ఉండటంతో ఈ ఏడాది కిలో పొగాకు రికార్డు ధర పలుకుతోంది. ఇప్పటి వరకు కిలో అత్యధిక ధర రూ.358 నమోదు కావడం విశేషం. నాణ్యమైన పొగాకు క్వింటాల్ రూ.35,800 పలుకుతోంది. మొత్తమ్మీద అన్ని గ్రేడ్లు కలిపి కిలో పొగాకు సరాసరి ధర రూ.254గా రీజియన్ పరిధిలో నమోదైంది. కందుకూరు వేలం కేంద్రాల్లో కిలో పొగాకు సరాసరి ధర రూ.257 వరకు వచ్చింది. నాణ్యతతో సంబంధం లేకుండా క్వింటాల్ పొగాకు రూ.25,700 వరకు వచ్చాయి. 2022 – 23 సీజన్లో ఇదే ధర సరాసరి రూ.214 వరకు ఉండింది.

అధికారిక అమ్మకాలు పూర్తి కావొచ్చాయ్

బోర్డు అనుమతించిన మేరకు అధికారిక పొగాకు విక్రయాలు పూర్తి కావొచ్చాయి. ఇప్పటి వరకు నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 88 మిలియన్ కిలోలకు గానూ 81 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తులను కొనుగోలు చేశాం. పొగాకు ముక్క, చూరను కొనుగోలు చేస్తాం. అనధికారిక కొనుగోళ్లపై బోర్డు నిర్ణయం వచ్చిన వెంటనే ప్రారంభిస్తాం. మరో రెండు నెలల వరకు వేలం సాగే అవకాశం ఉంది.

– లక్ష్మణరావు, ఆర్‌ఎం, పొగాకు బోర్డు

సుపరిపాలనే లక్ష్యంగా పనిచేయాలి

- మంత్రి నారాయణ

నెల్లూరు (దర్గామిట్ట): ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో కలెక్టర్ హరినారాయణన్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రజలను ఇబ్బంది పెట్టకుండా, అందరికీ సుపరిపాలన అందించడమే లక్ష్యంగా జిల్లాలోని అధికారులు పని చేయాలని కోరారు. జిల్లాలో ఇప్పటివరకు జరిగిన హౌసింగ్ పురోగతిని ఆరాతీశారు. వివిధ లేఅవుట్లలో మౌలిక వసతులను కల్పిస్తే ప్రజలు ముందుకొచ్చి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకుంటారని తెలిపారు. మైనింగ్ శాఖపై త్వరలోనే పూర్తి స్థాయిలో దృష్టి సారించనున్నామన్నారు. నూతన నిర్మాణాలకు సంబంధించిన అనుమతులను ఆన్‌లైన్లో జారీ చేసే విధానాన్ని తమ ప్రభుత్వ హయాంలో అమలు చేశామని చెప్పారు. నుడా పరిధిలో నూతన లేఅవుట్లు వేసే వారు నిబంధనలను కచ్చితంగా పాటించి అనుమతులు పొందాలని సూచించారు. జేసీ సేతు మాధవన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, డీఆర్వో లవన్న, ఆర్డీఓ మలోల, హౌసింగ్ పీడీ నాగరాజు, విద్యుత్ ఎస్‌ఈ విజయన్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్న నారాయణ

తీరికగా వచ్చి తనిఖీలు

మర్రిపాడు: మర్రిపాడులో పది రోజులుగా సుమారు 20 ట్రాక్టర్లు, మూడు జేసీబీల సాయంతో ఇసుకను నిత్యం అక్రమంగా రవాణా చేస్తున్నారనే స్థానికుల ఫిర్యాదుతో అధికారులు గురువారం తీరికగా వచ్చి తనిఖీలు చేపట్టారు. ఇసుక డంపింగ్ యార్డును విజిలెన్స్, మైనింగ్ ఏడీ బాలాజీనాయక్ ఆధ్వర్యంలో అధికారులు, ఇన్‌చార్జి తహసీల్దార్ తనిఖీ చేశారు. ఈ నెల ఆరున ఏ మేరకు డంపింగ్ యార్డులో ఇసుక ఉందో ప్రస్తుతం అంతే ఉందని తేల్చారు. 1,75,425 క్యూబిక్ మీటర్ల ఇసుకను డంపింగ్ చేసి ఉన్నారని గుర్తించామన్నారు. 24 గంటలూ వీఆర్‌ఓ, వీఆర్‌ఏ ఉండేలా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. కాగా డంపింగ్ యార్డు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలు, మూడు ట్రాక్టర్లు, ఒక టిప్పర్, పొక్లయినర్లకు రూ.1.2 లక్షల జరిమానాను విజిలెన్స్ అధికారులు విధించారు.



న్యాయవాదుల నిరసన



నెల్లూరు (లీగల్): వచ్చే నెల నుంచి మూడు కొత్త క్రిమినల్ చట్టాలు అమల్లోకి రానున్నాయని, వీటిని వాయిదా వేయాలంటూ న్యాయవాదులు నిరసన కార్యక్రమాన్ని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యంలో గురువారం చేపట్టారు. నెల్లూరు జిల్లా కోర్టు సముదాయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐలు జిల్లా అధ్యక్షుడు అంకయ్య మాట్లాడారు. ఈ మూడు చట్టాలు అమలైతే.. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973, భారతీయ శిక్షాస్మృతి 1860, భారతీయ సాక్ష్యాధారాల చట్టం 1872 రద్దవుతాయని చెప్పారు. అనంతరం సీనియర్ న్యాయవాదులు జక్కా శేషమ్మ, ప్రసాద్ మాట్లాడారు. కొత్త చట్టాల్లోని చాలా నిబంధనలు రాజ్యానికి అనుకూలంగా ఉన్నాయని, దీని వల్ల చాలా సమస్యలు వస్తాయన్నారు. కార్యదర్శి చుక్కా రమేష్, న్యాయవాదులు సాయికుమార్, రాఘవ, సుమంత్, కిరణ్, శివ, శ్వేత, మల్లిక, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

నర్రవాడలో భక్తుల సందడి



వేడుకగా గ్రామోత్సవం



పొంగళ్లు పెడుతున్న మహిళలు

- ముగిసిన వెంగమాంబ బ్రహ్మోత్సవాలు
- చివరి రోజు పొంగళ్ల సమర్పణ

దుత్తలూరు: నర్రవాడలో కొలువైన వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాల్లో భాగంగా పొంగళ్లను భక్తిశ్రద్ధలతో గురువారం పొంగించారు. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తుల తాకిడి పెరిగింది. మహిళలు భారీ సంఖ్యలో హాజరై అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యాన్ని సమర్పించారు. భక్తులు తమ వాహనాలకు పూజలు చేయించారు. హోమగుండంలో ఎండుకొబ్బరి వేశారు. హోమగుండం వద్ద చెట్టుకు ముడుపులు కట్టి అమ్మవారికి వరపడ్డారు. నర్రవాడ, గుదేవారిపాళెం, ఉలవవారిపాళెం గ్రామాల్లో అమ్మవారి గ్రామోత్సవాన్ని జరిపారు. పుట్టకు నమస్కరించి పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థాన ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. అమ్మవారికి పుట్టింటి చీర, సారెను సంప్రదాయబద్ధంగా సాయంత్రం తీసుకొచ్చారు.

ఉత్సాహంగా ఎడ్ల బండలాగుడు పోటీలు

నర్రవాడలోని వెంగమాంబ బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. నంద్యాల జిల్లా గుంపరమావదిన్నెకు చెందిన కుందూరు రామ్‌భూపాల్‌రెడ్డి ఎడ్లు ప్రథమ, వైఎస్సార్ జిల్లా చౌటపల్లికి చెందిన మార్తాల చంద్రఓబుల్‌రెడ్డి ఎడ్లు ద్వితీయ, గుంటూరు జిల్లా కుంచనపల్లికి చెందిన పులగం త్రిశజ్ఞారెడ్డి ఎడ్లు తృతీయ, ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన మక్కిన కోటేశ్వరరావు ఎడ్లు నాలుగు, నంద్యాల జిల్లా మురాళ్లపల్లికి చెందిన పులి చినఓబుల్‌రెడ్డి ఎడ్లు ఐదు, బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పావులూరి వీరాస్వామిచౌదరి ఎడ్లు ఆరో స్థానంలో నిలిచాయి. తొలి పది స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, అధికారులు, దాతలు అందజేశారు. ఎడ్ల పందేల నిర్వహణలో కీలకపాత్ర పోషించిన మేకపాటి మాల్యాద్రినాయుడ్ని సత్కరించారు.



ఎరువుల దుకాణాల్లో తనిఖీ



ఉదయగిరి: పట్టణంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను జిల్లా తనిఖీ బృంద అధికారులు నెల్లూరు ఏడీఏ నందనం శ్రీనివాసులు, ఏఓ నాగమోహన్ ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు. దుకాణాల్లోని విత్తనాల స్టాక్‌బోర్డు, స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్‌లు, నిల్వలను తనిఖీ చేసిన అనంతరం వారు మాట్లాడారు. రైతులు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకూ బిల్లును తప్పక ఇవ్వాలని సూచించారు. విత్తనాలు మొలకశాతాన్ని పరిశీలించి.. నాణ్యతను నిర్ధారించాకే రైతులకు విక్రయించాలని చెప్పారు. నిబంధనలను పాటించకపోతే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. స్థానిక ఏడీఏ చెన్నారెడ్డి, ఏఓ ఆంజనేయులునాయక్ పాల్గొన్నారు.

ఏపీ ఎడ్‌సెట్ ఫలితాల విడుదల

నెల్లూరు (టౌన్): బీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీ ఎడ్‌సెట్ ఫలితాలను ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ గురువారం విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 900 మందికి పైగా పరీక్షకు హాజరయ్యారు. ఇంగ్లిష్ మెథడాలజీలో వింజమూరు మండలం వెంగమాంబపురానికి చెందిన చిన్నబోయిన వెంకటశ్రీహాసిత 95 మార్కులతో రాష్ట్ర స్థాయిలో తొమ్మిదో ర్యాంక్‌ను సాధించారు. మ్యాథమేటిక్స్ మెథడాలజీలో తోటపల్లిగూడూరు మండలం ఇస్కపాళేనికి చెందిన శ్రీనివాసులు 83 మార్కులతో ఆరు.. ఫిజికల్ సైన్స్ మెథడాలజీలో ఏఎస్‌పేట మండలం తెల్లపాడుకు చెందిన లెక్కల కల్యాణి 86 మార్కులతో ఏడో ర్యాంక్‌ను సాధించారు.

- రెండేళ్ల ఎల్‌ఎల్‌ఎం, మూడేళ్లు, ఐదేళ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సుల ఫలితాలను విడుదల చేశారు. ఇందులోనూ జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులను సాధించారు.

ఏపీ పీజీసెట్..

పీజీ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన ఏపీ పీజీసెట్ ఫలితాలను విడుదల చేశారు. పొలిటికల్ సైన్స్‌లో దర్గామిట్టలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన పఠాన్ సాజిదాబేగం 80 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంక్‌ను సాధించారు. సంస్కృతంలో నెల్లూరులోని కపాడిపాళేనికి చెందిన ముత్యాల శివనాగమణి 50 మార్కులతో తృతీయ, హిందీలో పద్మావతి సెంటర్ గౌతమినగర్‌కు చెందిన సయ్యద్ సుమయ్యా 80 మార్కులతో నాలుగు.. పర్ఫార్మింగ్ ఆర్ట్స్ అండ్ మ్యూజిక్‌లో సీతారామపురం మండలానికి చెందిన అశోక్‌బాబు 53 మార్కులతో పది.. కామర్స్‌లో బాలాజీనగర్‌కు చెందిన చుండి సాయికేశవ హరిప్రియ 62 మార్కులతో పది.. ఎడ్యుకేషన్ సబ్జెక్టులో నవాబుపేటకు చెందిన బోయిన చైతన్య 71 మార్కులతో తొమ్మిదో ర్యాంక్‌ను సాధించారు.

క్లుప్తంగా

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

• మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



మాట్లాడుతున్న రామనారాయణరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): 'పింఛన్ల పంపిణీకి వలంటీర్లను వినియోగించడం లేదు. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దే నగదు పంపిణీకి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాం' అని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరులోని సంతపేటలో ఉన్న క్యాంపు కార్యాలయంలో ఆయన గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పింఛన్లకు సంబంధించి జిల్లాలో 3,19,961 మంది లబ్ధిదారులకు రూ.218.87 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పలు పెన్షన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఆలయాల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామన్నారు. అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నామని చెప్పారు. దేవాలయాల్లో ధూప, దీప నైవేద్యాలను రూ.10,000కు పెంచేందుకు ప్రతిపాదనలను సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నామన్నారు. సమావేశంలో బొల్లినేని గిరినాయుడు, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున నెల్లూరు కరెంటాఫీసు రైల్వే గేటు సమీపంలో జరిగింది. మృతుడి వయసు 40 నుంచి 45 సంవత్సరాల్లోపు ఉండొచ్చని భావిస్తున్నారు. పసుపు రంగు హాఫ్ హ్యాండ్స్ చొక్కా, క్రీమ్ కలర్‌పై ఆకుపచ్చ అంచు ఉన్న పంచె ధరించి ఉన్నాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న రైల్వే ఎస్సై మాలకొండయ్య ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చెంగాళమ్మ హుండీ కానుకల లెక్కింపు

సూళ్లూరుపేట రూరల్: స్థానిక చెంగాళమ్మ ఆలయంలో హుండీ కానుకలను గురువారం లెక్కించారు. 105 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.59,51,539లు వచ్చినట్లు దేవదాయ శాఖ కమిషనర్ డబ్బుగుంట వెంకటేశ్వర్లు తెలిపారు.

కండలేరులో 6.330 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 6.330 టీఎంసీలున్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5, పిన్నేరువాగుకు 10, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 136
లేయర్ (లైవ్)	: 120
బ్రాయిలర్ చికెన్	: 244
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 272
లేయర్ చికెన్	: 204

జిల్లాలో ఆర్టీసీ కార్గో సేవలు భేష్

• ఏటా పెరుగుతున్న రాబడి
• 2021 నుంచి డోర్ డెలివరీ సేవలందిస్తున్న సంస్థ
• నెల్లూరు, కావలి, కందుకూరు ప్రాంతాల్లో ప్రారంభం

సురక్షితం.. వేగవంతం

మారిన పరిస్థితులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీ సేవలను విస్తరించింది. కొన్ని సంవత్సరాల క్రితం కార్గో డోర్ డెలివరీని ప్రారంభించింది. ప్రైవేట్ కొరియర్ సర్వీసులకు ఏ మాత్రం తీసిపోని విధంగా మరింత నమ్మకం కలిగించే రీతిలో సేవలకు ఎప్పటికప్పుడు మెరుగులు దిద్దుతోంది.

నెల్లూరు సిటీ: ప్రైవేట్ కొరియర్ సర్వీస్‌లకు ఏ మాత్రం తీసిపోకుండా ఏపీఎస్ ఆర్టీసీ అనుబంధ విభాగమైన కార్గో తయారైంది. రాబడి పెంచుకుంటూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తోంది. ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు బస్సుల ద్వారా వస్తువులను వేగవంతంగా రవాణా చేస్తోంది. దీంతో వ్యాపారులు ఆర్టీసీ కార్గోపై ఆదరణ చూపిస్తున్నారు. అదే విధంగా డోర్ డెలివరీ సేవలను 2021 సంవత్సరంలో ప్రారంభించింది. నెల్లూరు నగరంతోపాటు కందుకూరు, కావలి ప్రాంతాల్లోనూ ఈ సేవలను అధికారులు అందిస్తున్నారు. రానున్న రోజుల్లో జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు విస్తరించేందుకు చర్యలు తీసుకున్నారు. జిల్లాలో మొత్తం 34 కార్గో కేంద్రాలున్నాయి. హైదరాబాద్, చెన్నై, బెంగళూరుతోపాటు విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, కర్నూలు, కడప ఇలా చాలా ప్రాంతాలకు పార్సిల్ సర్వీసులను అందిస్తోంది. కార్గో ద్వారా ఆర్టీసీకి ఏటా సుమారు రూ.2 కోట్ల మేర రాబడి పెరుగుతోంది. 2020 – 21లో రూ.4.64 కోట్లు రాగా , 2021 – 22లో రూ.6.37 కోట్లు, 2022 – 23లో రూ.9.83 కోట్లు, 2023 – 24లో రూ.11.51 కోట్లు, ఈ ఏడాదిలో ఏప్రిల్, మే నెలలో రూ.1.81 కోట్ల రాబడి వచ్చింది.



కొరియర్ బుక్ చేసుకుంటున్న సిబ్బంది



ఆర్టీసీ బస్టాండ్ వద్ద పార్సిల్, కొరియర్ సర్వీస్ కార్యాలయం

ఏటీబీ కౌంటర్ పొందడం ఎలా?

కార్గో ద్వారా యువతకు ఉపాధి కల్పించేందుకు ఆర్టీసీ ప్రయత్నిస్తోంది. తక్కువ పెట్టుబడితో ఆదాయం సాధించేందుకు ఏటీబీ కౌంటర్లు చేసుకునే అవకాశం ఇచ్చింది. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు డోర్ డెలివరీ సేవలు అందించడం ద్వారా రానున్న రోజుల్లో యువతకు మంచి అవకాశాలుంటాయి. ఔత్సాహికులు ఏటీబీ (ఆథరైజ్డ్ పార్సిల్ బుకింగ్) కౌంటర్‌ను తక్కువ పెట్టుబడితో పెట్టి ఆదాయం పొందే అవకాశాన్ని ఆర్టీసీ కల్పిస్తోంది. గ్రామాల్లో రూ.1,000, మున్సిపాలిటీల్లో రూ.2,500, కార్పొరేషన్లో రూ.5,000 డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. ఏటీబీ ఏజెంట్‌గా అర్హత పొందిన వారికి సరుకుల బుకింగ్‌పై 15 శాతం ఆదాయం వస్తుంది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికి ఆన్‌లైన్ టికెట్ అమ్మకాలు కూడా చేయొచ్చు. ఇందుకు కమీషన్ చెల్లిస్తుంది. కౌంటర్ కోసం కంప్యూటర్, బస్టాండ్ సమీపంలో రూమ్, వేయింగ్ మెషీన్, ప్రింటర్ కలిగి ఉండాలి. ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, ఈ–మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్ తదితర వివరాలతో నెల్లూరు కార్గో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.



సరుకులు తరలిస్తున్న కూలీలు

ఆర్థిక సంవత్సరం	రాబడి
2020 - 21	రూ.4.64 కోట్లు
2021 - 22	రూ.6.37 కోట్లు
2022 - 23	రూ.9.83 కోట్లు
2023 - 24	రూ.11.51 కోట్లు
2024 (ఏప్రిల్, మే నెలల్లో)	రూ.1.81 కోట్లు

నాణ్యమైన సేవలు



పార్సిల్, కొరియర్ సర్వీస్‌ల ద్వారా నాణ్యమైన సేవలు అందిస్తున్నాం. ప్రజలకు మరింతగా సేవలు అందించేందుకు జిల్లా వ్యాప్తంగా ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా లాజిస్టిక్స్ ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నాం.

– దివ్య కామాక్షి, ఆర్టీసీ కార్గో మేనేజర్

ఆదాయం పెరుగుతోంది



కార్గో ద్వారా ఆర్టీసీకి ఆదాయం వస్తోంది. ప్రతి ఏటా పెరుగుతోంది. వినియోగదారులు కూడా కార్గో సేవల పట్ల సంతృప్తిగా ఉన్నారు. అదే విధంగా డోర్ డెలివరీ సేవలు కూడా పూర్తిస్థాయిలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– పీవీ శేషయ్య, జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి

అనిల్‌పై ఆరోపణలు సరికాదు

• వాస్తవాలు తెలుసుకుని మాట్లాడండి
• వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నెల్లూరు(పొగతోట): 'వెంకటేశ్వరపురంలో రూ.కోట్ల విలువ చేసే భూమిని మాజీ మంత్రి డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్ కబ్జా చేశారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇది సరికాదు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి' అని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ హంజా హుస్సేనీ, జిల్లా నాయకుడు జియా ఉల్ హక్ అన్నారు. గురువారం నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కౌసర్‌జాన్ అనే మహిళను టీడీపీ నాయకులు పోలీసుల వద్దకు తీసుకెళ్లి భూమిని అనిల్ కబ్జా చేశాడని ఫిర్యాదు చేయించడం బాధాకరమన్నారు. వెంకటేశ్వరపురం సర్వే నంబర్ 2222/2లో సీజేఎఫ్ఎస్ భూములు ఉన్నాయన్నారు. వీటిని 2015లో అప్పటి టీడీపీ ప్రభుత్వం టిడ్కో గృహాల నిర్మాణాలకు సేకరించడం జరిగిందన్నారు. అయితే నాడు లబ్ధిదారులకు నష్టపరిహారం అందలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అనిల్ చొరవ తీసుకుని ఇప్పించారన్నారు. 2021లో వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేయడానికి భూమి మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ లేఖ రాయడం జరిగిందన్నారు. వెంకటేశ్వరపురంలో 2.33 ఎకరాల భూమిని 33 సంవత్సరాలకు లీజుకు ఇచ్చినట్లు చెప్పారు. రూ.66 వేలు లీజు నగదు చెల్లించారన్నారు. అప్పటి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కార్యాలయం నిర్మాణానికి శంకుస్థాన చేశారన్నారు. ఈ విషయాన్ని ఆయన్ను అడిగి తెలుసుకోవచ్చన్నారు. లీజు కేటాయింపు, నిర్మాణానికి సంబంధించి అనుమతి పత్రాలు అన్ని వేమిరెడ్డి వద్ద ఉన్నాయన్నారు. పూర్తి వివరాలను కలెక్టర్ ద్వారా కూడా అడిగి తెలుసుకోవచ్చన్నారు. భూమిని అనిల్ కబ్జా చేశాడని ప్రజల్లో లేనిపోని అపోహలు సృష్టించడం దారుణమన్నారు. తప్పుడు కేసులను ఉపసంహరించుకోకపోతే పరువు నష్టం దావా వేస్తామని తెలిపారు. సమావేశంలో మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ సిద్దిఖ్, నగర పాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ జమీర్, నాయకులు అబ్దుల్ మస్తాన్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసుల కొరడా

• 36 మందిపై కేసుల నమోదు

నెల్లూరు(క్రైమ్): రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న 36 మందిపై కేసులు నమోదు చేశారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కొందరు మృతిచెందుతుండగా అధిక శాతం మంది క్షతగాత్రులవుతున్నారు. రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించిన ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ డ్రంక్ అండ్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు జిల్లా వ్యాప్తంగా డ్రైవ్ నిర్వహించారు. 36 మంది వాహన చోదకులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ మితిమీరిన వేగం, పరిమితికి మించిన ప్రయాణం, డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రమాదకరమన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలని వాహనచోదకులకు సూచించారు. రోడ్లపై వ్యతిరేక దిశల్లో గానీ, జాతీయ రహదారిపై, దాబాలు, హోటల్స్ వద్ద రోడ్లపై ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నిలుపరాదని తెలియజేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్, నంబర్ ప్లేట్లు సక్రమంగా లేని వాహనాలు, ట్రిపుల్ రైడింగ్ తదితరాలపై నిరంతర తనిఖీలు నిర్వహిస్తామన్నారు.



ఆత్మకూరు బస్టాండ్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న నవాబుపేట పోలీసులు

మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి



కేసుల వివరాలను పరిశీలిస్తున్న ఎస్పీ



సమీక్షకు హాజరైన పోలీసు అధికారులు

• హత్య, పోక్సో కేసుల్లో నిందితులపై రౌడీ షీట్లు
• నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి
• ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

నెల్లూరు(క్రైమ్): 'జిల్లాలో మిస్సింగ్ కేసులు అధికమయ్యాయి. ఏహెచ్‌టీయూ, సీసీఎస్, సైబర్, ఐటీ కోర్ టీమ్ సహకారంతో సాంకేతికత ఆధారంగా కేసులను ఛేదించాలి' అని ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ పోలీసు అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో గురువారం ఆయన నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. సర్కిల్స్ వారీగా పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులు, హత్య కేసులు, పోక్సో, లైంగికదాడి, డెకాయిటీ, రాబరీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, 174 కేసులు, నాన్‌బెయిల్‌బుల్ వారెంట్లు, ఎన్‌డీపీఎస్ కేసులపై సమీక్షించారు. కేసుల పెండెన్సీని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, బాలికలు, వృద్ధుల మిస్సింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గాలింపు చర్యలను ముమ్మరం చేయాలన్నారు. ఇంటిగ్రేటెడ్ క్రిమినల్ ఇంటెలిజెన్స్ సిస్టమ్ (ఐసీఐఎస్), క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సీసీటీఎన్ఎస్), ఇన్వెస్టిగేషన్ ట్రాకింగ్ సిస్టమ్ ఫర్ సెక్సువల్ అఫెన్సెస్ (ఐటీఎస్ఎస్ఓ) తదితర సాంకేతికత ఆధారంగా కేసులను ఛేదించాలన్నారు. హత్య, పోక్సో కేసుల్లోని నిందితులపై రౌడీషీట్లు తెరవాలన్నారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్ఏ) నూతన చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. నేరాల కట్టడికి బీట్ వ్యవస్థను పటిష్టం చేయడంతోపాటు వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, రౌడీషీటర్లు, పాతనేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రాపర్టీ కేసులను ఛేదించి రికవరీ శాతాన్ని పెంచాలని చెప్పారు. గొలుసు దొంగతనాలను కట్టడి చేయాలని, ఈ తరహా అధికంగా జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాల నివారణకు జాతీయ, రాష్ట్ర రహదారుల్లో హైవే మొబైల్స్‌తో గస్తీ నిర్వహించాలన్నారు. ఈనెల 29వ తేదీన జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో అధిక కేసులు పరిష్కారమయ్యేలా చూడలన్నారు. సమావేశంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, ప్రసాద్, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొని పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు

• ఎనిమిది మందికి గాయాలు

ఉలవపాడు: అతివేగంగా వెళ్తున్న ఇంటర్‌సిటీ సంస్థ ట్రావెల్స్ బస్సు లారీని ఢీకొని అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటన మండలంలోని చాగల్లు – వీరేపల్లి మధ్య జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఇంటర్‌సిటీ సంస్థకు చెందిన బస్సు బుధవారం రాత్రి 30 మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి చెన్నైకి బయలుదేరింది. గురువారం ఉదయం 5 గంటల సమయంలో చాగల్లు దాటిన తర్వాత ముందు వెళ్తున్న లారీని ఢీకొని పొలాల్లోకి దూసుకెళ్లి ఆగిపోయింది. బస్సు ఢీకొనడంతో లారీ ముందు వెళ్తున్న మరో లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ మల్లారెడ్డి ఇరుక్కుపోవడంతో హైవే సిబ్బంది వచ్చి బయటకు తీశారు. ప్రయాణికులు లక్ష్మీరెడ్డి, వెంకటగణేష్, సత్య, మణి, శేషగిరి, ప్రియ, నారాయణకు గాయాలయ్యాయి. వీరిని 108, హైవే అంబులెన్స్‌లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. మిగిలిన ప్రయాణికులు వేర్వేరు ట్రావెల్స్ బస్సుల్లో వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి గురైన బస్సు



108 అంబులెన్స్‌లో క్షతగాత్రులు